ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 , కనిష్ఠం : 19.0
ANDHRAJYOTHY
5





వానరుడా ఇవేం బాధలు



అచ్చంపేటలో పంటలను నాశనం చేస్తున్న కోతులు
ఇళ్లలోకి చొరబడి తినుబండారాలు, వస్తువుల అపహరణ
గుంపులు గుంపులుగా వచ్చి దాడులు 6

మేమింతే.. మా రాతలింతే..



ప్రిస్క్రిప్షన్‌పై అవే అర్థంకాని రాతలు
ఎంసీఐ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న వైద్యులు
అనుబంధ మెడికల్ షాపులకే అర్థమయ్యేలా గీతలు 6

కాంచన గుహకు బంగారు కాంతులు

వైభవంగా కురుమూర్తి స్వామి అలంకారోత్సవం
ఆత్మకూరు ఎస్‌బీఐ నుంచి ఆభరణాల ఊరేగింపు
ఆకట్టుకున్న కేరళ కళాకారుల డోలు ప్రదర్శన 7

సమగ్ర ఇంటింటి సర్వే షురూ

- మొదటి రోజు ఇళ్లకు స్టిక్కర్ల అతికింత
- 8వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమం
- 9 నుంచి వివరాల సేకరణ



మహబూబ్‌నగర్ ఐదో వార్డులోని ఓ కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్/నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో బుధవారం ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు తమకు ఇచ్చిన 150 కుటుంబాల జాబితా మేరకు సంబంధిత ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ నెల ఎనిమిదో తేదీ వరకు స్టిక్కర్లు అంటించనుండగా, తొమ్మిదో తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి సర్వే వివరాలను నమోదు చేయనున్నారు. అప్పటి వరకు తాళాలు వేసిన, వలస వెళ్లిన వారిని పిలిపించుకోవాలని పక్కింటి వారికి సూచిస్తున్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు, పింఛన్లు వస్తాయన్న ఆశతో చాలామంది సర్వే కోసం ఎదురు చూస్తుండగా, పట్టణాలలో వివరాలు ఇస్తే ఏమవుతుందోనన్న ఆందోళనను పలువురు వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు పురపాలిక పరిధిలోని ఐదో వార్డు ఏనుగొండలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సర్వేను ప్రారంభించారు. మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్, కోయిలకొండ మండలాల్లో కలెక్టర్ పరిశీలించారు.

నారాయణపేటలో 42.60 శాతం పూర్తి

నారాయణపేట జిల్లాలో ఇళ్లకు స్టిక్కర్లను అతికించడం 42.60 శాతం పూర్తయ్యింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లాలోని జాజాపూర్, ధన్వాడలలో కొనసాగుతున్న సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మద్దూరులో అదనపు కలెక్టర్ బెన్‌షాలం, నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్‌లో జిల్లా ప్రణాళిక అధికారి ఎస్.యోగానంద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులు ఇళ్లకు స్టిక్కర్లు అతికించి, కుటుంబాలను గుర్తిస్తున్నారు. మొత్తం 1,55,894 నివాసాలకు గాను మొదటి రోజు గ్రామీణ ప్రాంతాల్లో 53,536 నివాసాలు, మునిసిపాలిటీల్లో 11,939 ఇళ్లకు స్టిక్కర్లు వేశారు.

న్యూస్ బాక్స్

ఉలిక్కిపడ్డ పోలీస్ అధికారులు

- ఆంధ్రజ్యోతి కథనంపై పోలీస్‌బాస్‌ల ఆరా
- కేసుల పరిష్కారంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'అడ్డుస్తున్న అహం.. బాధితులకు అందని న్యాయం.' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం వచ్చిన కథనం పోలీస్‌శాఖలో కలకలం రేపింది. ఉమ్మడి జిల్లాలోని పోలీస్ ఉన్నతాధికారులు ఈ కథనంపై ఆరాతీస్తూ, కేసుల నిర్లక్ష్యంపై అధికారులకు సీరియస్‌గా హెచ్చరించినట్లు తెలిసింది. పలు జిల్లాల పోలీస్ బాస్‌లు కథనంపై ఆరా తీస్తూ, బాధితులకు ఇబ్బందులు కలిగితే చర్యలు తప్పవంటూ హెచ్చరికలు జారీ చేశారని సమాచారం. ఎస్పీల వద్దకు వచ్చిన ఫిర్యాదులను స్టేషన్‌లకు పంపిస్తున్న క్రమంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అన్న వివరాలపై సమాచారం సేకరించినట్లు పోలీస్‌వర్గాలు వెల్లడించాయి. ఇకపై ర్యాండమ్‌గా ఫిర్యాదులు ఏమేరకు పరిష్కారం అవుతున్నాయో క్రాస్‌చెక్ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాల పోలీస్ అధికారుల్లో 'ఆంధ్రజ్యోతి' కథనంపై విస్తృత చర్చ జరిగింది.

పౌరసరఫరాల శాఖలో

దుమారం

- వనపర్తి డీఎంను బదిలీ చేస్తూ గత నెల 30న కమిషనర్ నుంచి ఉత్తర్వులు
- జాయిన్ కావడానికి వచ్చిన అధికారిని వెనక్కి పంపిన అధికారులు
- ప్రస్తుత అధికారి వికారాబాద్‌లో రిలీవ్ కాలేదనే ఆరోపణలు
- ఆధిపత్య పోరులో బదిలీ
- ఉత్తర్వుపై రాజకీయ చదరంగం
- డీఎంగా పని చేసిన వ్యక్తికే అనుభవం లేదనే సాకుతో పంపే ప్రయత్నం



సివిల్ సప్లయ్ కార్పొరేషన్ వనపర్తి డీఎం ఇర్ఫాన్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మీడియాతో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

మహబూబ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వనపర్తి జిల్లా పౌర సరఫరాల శాఖలో దుమారం చెలరేగింది. అవినీతి ఆరోపణలు, రాజకీయ ఆధిపత్య పోరు వెరసి జిల్లా అధికారుల తీరు అభాసుపాలవుతోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు విసురుకోవడానికి కారణమవుతోంది. ప్రస్తుతం వనపర్తి పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా ఇర్ఫాన్ పని చేస్తున్నారు. ఆయన గతంలో వికారాబాద్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో పని చేశారు. కొద్ది నెలలుగా వనపర్తిలో డీఎంగా పని చేస్తుండగా, గత అక్టోబరు 30వ తేదీన ఆయన్ను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నిజామాబాద్ డీఎంగా పని చేస్తున్న వైపీ రమేష్‌ను నియమిస్తూ పౌరసరఫరాల సంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ చేసి దాదాపు ఏడు రోజులు గడిచినా.. ఇర్ఫాన్ జిల్లా నుంచి రిలీవ్ కావడం లేదు. ఇక్కడికి పోస్టింగ్ ఉత్తర్వు తీసుకున్న రమేష్ జిల్లాకు వచ్చినా నియమాకం ఇవ్వడం లేదు. పైగా కొత్తగా పోస్టింగ్‌తో వచ్చిన అధికారిని రెండు నెలలు లీవ్ పెట్టుకొమ్మని కొందరు సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. తనకు అనుభవం లేదని, ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయనే సాకుతో ఇక్కడ బాధ్యతలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం పని చేస్తున్న ఇర్ఫాన్‌కు గతంలో పని చేసిన వికారాబాద్ జిల్లాలో రిలీవింగ్ ఆర్డర్ లేనే లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ అదే నిజమైతే ఇక్కడ పని చేయడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమవుతుంది. ఏ అధికారి అయినా బదిలీ అయినప్పుడు పని చేసిన జిల్లా నుంచి రిలీవ్ ఆర్డర్‌ను

(మిగతా 7లో..)

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

- పీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేసిన కళాశాలలపై కఠిన చర్యలు తప్పవని పీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం పీయూలోని తన చాంబర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. పీయూ విద్యార్థి నాయకులు తన దృష్టికి తెచ్చిన అధిక ఫీజులు వసూలు చేసిన గద్వాల ఎస్‌డీఎమ్ కళాశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. పీయూ అనుబంధంగా వున్న ఏ కళాశాల అయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రిజిస్ట్రార్, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకుపచ్చ తోరణం

క్లిక్.. క్లిక్..





వనపర్తి జిల్లా మదనాపురం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి. రెండు వైపుల నుంచి అల్లుకున్నట్లున్న చెట్లు రోడ్డుకు తోరణంలా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్డు వెంట వెళ్తున్న వారు ఆ చెట్ల కింద కొద్దిసేపు ఆగి సేద తీరుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఆ దృశ్యాలను క్లిక్ మనిపించింది.

– ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

అందని రెండో పార్టు పుస్తకాలు

- లక్షా 60 వేల పుస్తకాలకు వచ్చింది లక్షా 20 వేలే..
- నారాయణపేట జిల్లాలో విద్యార్థుల నిరీక్షణ



నారాయణపేటలోని గోదాంలో ఉన్న పాఠ్య పుస్తకాలు

నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పార్టు సెకండ్(రెండో వాచకం) పాఠ్య పుస్తకాలు నేటికీ అందలేదు. జిల్లా వ్యాప్తంగా లక్షా 60 వేల పుస్తకాలు అవసరం ఉండగా, లక్షా 20 వేల పుస్తకాలు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. వారం రోజుల క్రితం పుస్తకాలు వచ్చాయని, నారాయణపేటలోని సింగార్‌బేస్ ప్రభుత్వ పాఠశాల గోదాంలో భద్రపరిచామని అంటున్నారు. రెండో తరగతి విద్యార్థులకు గణితం రెండో పార్ట్ పుస్తకం అందాల్సి ఉంది. మూడు, నాలుగు, ఐదు తరగతులకు ఈవీఎస్(ఎన్విరాల్‌మెంట్ సైన్స్), ఆరు, ఏడుకు గణితం, సైన్స్, సోషల్, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్ బయో సైన్స్, సోషల్ పాఠ్య పుస్తకాలు రెండో వాచకం ఇవ్వాల్సి ఉంది. వాటి కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. కొత్త ఉపాధ్యాయుల కౌన్సెలింగ్, నియామకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు వంటి వాటి నేపథ్యంలో పుస్తకాల పంపిణీ ఆలస్యమైందని అధికారులు అంటున్నారు. అక్టోబరు మొదటి వారంలో పంపిణీ చేయాల్సిన పాఠ్య పుస్తకాలు నవంబరు మొదటి వారం పూర్తవు తున్నా పంపిణీ చేయకపోవడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రెండో పార్టు పుస్తకాలను గురువారం నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తామని చెప్పారు.

పది విద్యార్థులకు ప్రత్యేక బోధన

- గత నెల 30న ప్రారంభం
- రోజూ ఒక సబ్జెక్టుపై తరగతులు
- రోజు విడిచి రోజు స్లిప్ టెస్టులు



కోటకొండ జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

నారాయణపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా నారాయణపేట జిల్లా విద్యాశాఖ ప్రతేక ప్రణాళిక రూపొందించింది. గత సంవత్సరం ఉమ్మడి జిల్లాలో నారాయణపేట పది ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా అగ్ర స్థానంలో నిలవాలనే లక్ష్యంతో విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్ దిశా నిర్దేశంలో డీఈవో అబ్దుల్‌ఘని జిల్లా వ్యాప్తంగా గత అక్టోబరు 30వ తేదీ నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. డిసెంబరు 30 వరకు ఈ తరగతులు కొనసాగనున్నాయి. రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు గంట పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఒక సబ్జెక్టును బోధిస్తున్నారు. బోధనతో పాటు రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నారు. డిసెంబరు నాటికి సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి ఉదయం, సాయత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 495 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 6,661 మంది పదో తరగతి చదువుతున్నారు.

సిలబస్ 70 శాతం పూర్తయ్యింది



మంచి ఫలితాల కోసం పదో తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సంశయాలు తీర్చడంతో పాటు స్లిప్ టెస్టులు పెడుతున్నాం. ఇప్పటికే సిలబస్ 70 శాతం పూర్తయ్యింది. డిసెంబరు వరకు మొత్తం పూర్తి చేసి, జనవరి నుంచి రివిజన్ తరగతులు ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ టి.సునిత, హెచ్‌ఎం, కోటకొండ జడ్పీహెచ్‌ఎస్



విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయురాలు

న్యూస్ బాక్స్

ఆలయంలో చోరీ

- బస్సులో పట్టుబడిన దంపతులు

మద్దూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆలయంలో చోరీ చేసిన సామగ్రితో బస్సులో ప్రయాణిస్తున్న దంపతులను ప్రయాణికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల శివారులో బుధవారం జరిగింది. మద్దూర్‌కు చెందిన ఈరముష్టి శ్రీనివాస్ దంపతులు పట్టణ శివారులోని శివాలయంలో గంటలు, ఆంప్లిఫైర్, మైక్ తదితర సామగ్రిని చోరీ చేశారు. వాటిని తీసుకొని మహబూబ్‌నగర్‌కు వెళ్లే బస్సులో ఎక్కారు. తోటి ప్రయాణికులకు అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సంచీని సోదా చేయగా, ఆలయ సామగ్రి కన్పించింది. ఈ విషయాన్ని పోలీసులకు తెలుపడంతో, వారొచ్చి నిందితులను స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు.

నేడు జిల్లా చెస్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్‌లో చెస్ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అండర్-14, 17 చెస్ బాల, బాలికల జట్లను ఎంపిక చేస్తామని, ఉదయం తొమ్మిది గంటలకు ఉంటాయని క్రీడాకారులు రావాలని పేర్కొన్నారు. పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో రావాలని, ఎవరి చెస్ బోర్డు వారే తెచ్చుకోవాలని సూచించారు.

112 సెల్‌ఫోన్ల రికవరీ



బాధితురాలికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ సత్ఫలితాలనిస్తోంది. ఫోన్లు పోయాయని ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఫోన్లను గుర్తిస్తున్నారు. ఇలా 112 ఫోన్‌లను రికవరీ చేయగా, బుధవారం జిల్లా కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ జానకి వాటిని బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్లు దొంగిలించబడినప్పుడు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే.. ఉపయోగించడకుండా బ్లాక్ చేస్తారన్నారు. దీంతో ఆ ఫోన్ వాడకం కష్టమవుతుందన్నారు. తద్వారా చోరీలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్‌లకు సైబర్ నేరాలపై ఎస్పీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ ఏ రాములు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేశ్ కుమార్, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుదర్శన్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నీటి అక్రమ వ్యాపారంపై కొరడా

- ఫాంపాండ్‌లను ధ్వంసం చేసిన రెవెన్యూ శాఖ



ఓ ఫాంపాండ్‌ను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం పోలేపల్లి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లను నీటి అక్రమ వ్యాపారానికి వినియోగిస్తున్న విషయం లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ బృందం తనిఖీలతో బహిర్గతం కావడంతో రెవెన్యూశాఖ కొరడా ఝుళిపించింది. వ్యవసాయ క్షేత్రాల్లో నిర్మించిన ఫాంపాండ్‌లను అధికారులు బుధవారం ఎక్స్‌కవేటర్‌లతో ధ్వంసం చేయించారు. వ్యవసాయ బోర్లతో ఫాంపాండ్‌లలో నీటిని నింపి, అదే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌తో వాటర్ ట్యాంకర్‌లను నింపి సెజ్‌లోని పరిశ్రమలకు నీటిని విక్రయిస్తున్నట్లు లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ బృందం గుర్తించింది. ఈ మేరకు విషయాలను జడ్చర్ల తహసీల్దార్‌కు వివరించడంతో పాటు లోకాయుక్తకు నివేదికను సమర్పించనున్నట్లు ఇన్వెస్టిగేషన్ అధికారి మాధ్యూకోషి వెల్లడించారు. ఈ నేపథ్యంలో బుధవారం సుమారు ఆరు ఫాంపాండ్‌లను జడ్చర్ల తహసీల్దార్ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు గిర్దావర్ ఖదీర్ తెలిపారు. ఫాంపాండ్‌ల ధ్వంసం చేసే ప్రక్రియను కొనసాగించనున్నట్లు ఆయన వెల్లడించారు. సెజ్‌లోని ఫార్మ పరిశ్రమలకు నీటిని విక్రయిస్తున్న వారిలో మాజీ సర్పంచ్‌లు ఉండడం గమనార్హం. ఏకంగా వ్యవసాయ క్షేత్రం నుంచి అండర్‌గ్రౌండ్ పైపులైను నిర్మాణం చేపట్టి, సెజ్‌లోని హెటిరో పరిశ్రమ ఓ మాజీ సర్పంచ్ నీటిని విక్రయిస్తున్న అంశం సైతం బహిర్గతం కావడంతో గ్రామంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిదులుగా చెలామణి అయ్యి, అక్రమంగా నీటి వ్యాపారం నిర్వహిస్తున్న నాయకులపై గ్రామస్థులు విమర్శలు చేస్తున్నారు.



వా..నరుడా.. ఇవేం బాధలు!

- ధ్వంసమవుతున్న పంటలు
- ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను తీసుకెళ్తున్న కోతులు
- గుంపులు గుంపులుగా వచ్చి దాడులు
- పల్లెలు, పట్టణాల్లో సమస్యగా మారిన కోతుల బెడద



గతంలో పల్లెల్లో ప్రదర్శించే సర్కస్‌లో కోతి చేసే స్టంట్లు అన్నీ ఇన్నీ కావు.. అవి చూసి పల్లె జనం అమితానందం పొందేవారు. ఇప్పుడు గ్రామాల్లో కోతులు చేస్తున్న చేష్టలకు ప్రజలు విసిగి వేసారి పోతున్నారు. ఎప్పుడు కోతుల సమస్య పరిష్కారం అవుతుంది.. దేవుడా.. అంటూ మొర పెట్టుకొనే పరిస్థితి ఏర్పడింది.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో అధిక విస్తీర్ణంలో అడవులు ఉండటంతో వన్య ప్రాణులతో పాటు కోతులు కూడా అధికంగా ఉన్నాయి. 2021 లెక్కల ప్రకారం 11,600 కోతులున్నట్లు తెలుస్తుంది. అనాధికారిక లెక్కల ప్రకారం దాదాపు లక్ష వరకు ఉండొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. అడవులలో ఉండాల్సిన కోతులు పల్లెల్లో, పంట పొలాల్లో తిరుగుతున్నాయి. రైతుల పంట పొలాల్లో విధ్వంసకాండ సృష్టిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను తీసుకెళుతున్నాయి. ఒక దశలో మనుషులపై పడి రక్కేస్తున్నాయి. వ్యాపార సముదాయాలకు కోతుల బెడదనుంచి రక్షించుకునేందుకు ఇనుప జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల చుట్టూ సోలార్ రక్షణ కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

● ఇంటి చుట్టూ సోలార్ కంచెలు

రోజు రోజుకు కోతుల బెడద అధికం అవుతుండటంతో ఎటూ పాలుపోని ప్రజలు కోతులను బెదరకొట్టేందుకు నానా తంటాలు పడుతున్నారు. విశ్వ ప్రయత్నాలు చేసినా ఫలితం లేక పోవడంతో చివరి ఆయుధంగా ఇంటి చుట్టూరా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. సోలార్ ఫెన్సింగ్ డబ్బుతో ముడిబడి ఉండటంతో పేదలు మినహా చాలా వరకు తగిన ఏర్పాట్లలో ఉన్నారు. ఇళ్లలోనికి చొరబడి తినుబండారాలు అందిన కాడికి ఎత్తుకెళుతున్నాయి. ఒక్కో దశలో మీదపడి రక్కుతున్నాయి.



కోతుల బెడదతో ఇంటికి ఏర్పాటు చేసుకున్న సోలార్ కంచె



పంటకు కంచె ఏర్పాటు చేసుకున్న రైతు

కూరగాయల సాగుకు దూరం

కోతుల బెడద అధికమవ్వడంతో రైతులు కూరగాయలు, పండ్లతోటల సాగు చేయాలంటేనే భయపడుతున్నారు. బెండ, పచ్చిమిర్చి మినహా మరింకెలాంటి కూరగాయలు సాగు చేయడం లేదు గ్రామాల్లో పెరట్లో సాగు చేసుకొనే పండ్లు, పూలమొక్కలు సైతం కోతులు ధ్వంసం చేస్తున్నాయి. యాసంగిలో సాగయ్యే వేరుశనగ పంటలపై పడి రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. మామిడి, బత్తాయి తదితర పండ్లతోటల రైతుల బాధలు అయితే వర్ణనాతీతం. రాత్రీ పగలు అనే తేడాలేకుండా పండ్ల తోటలపై పడి నాశనం చేస్తున్నాయి.

● అడవులను ఎందుకు వీడుతున్నాయి?

అడవులలో సరైన ఫలసాయం లభించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు వాతావరణ సమతుల్యత బాగా దెబ్బతిని వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకొని అతివృష్టి అనావృష్టి ఏర్పడటం, అడవులలో మానవులు సృష్టిస్తున్న అలజడులు వీటన్నిటికీ కారణాలవుతున్నాయి. ప్రజల మధ్య జీవించడం కోతులకు అలవాటుగా మారింది. ఒక దశలో మనుషులపైనే వాటి ప్రతాపం చూపిస్తున్నాయి.

సోలార్‌కు కంచె ఏర్పాటు చేసుకోవడంతో కోతుల బెడద తగ్గింది



రోజూ కోతుల బెడదతో ఇబ్బంది పడేవాళ్లం. ఇళ్లలోకి దూరి ఇంట్లో ఉండే తినుబండారాలను ఎత్తుకెళ్లేవి. అడ్డుకోబోతే కరిచేందుకు ఎగబడేవి. ఈ బాధ తట్టుకోలేక రూ.80 వేలకు పైగా ఖర్చుచేసి ఇంటి చుట్టూరా సోలార్ కంచెను ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పుడు కోతుల బెడద తప్పింది.

- కె.సుగుణమ్మ, చెన్నారం



దుకాణానికి ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్న యజమాని

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

- సుఖశాంతులు కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి పూజలు



ఆలయంలో స్వామి వారికి పూజలు చేస్తున్న సీఎం సతీమణి గీత

వంగూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వగ్రామైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రూ. మూడు కోట్లతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతి ష్ఠాపన కార్యక్రమాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత పాల్గొన్నారు. ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సీఎం సోదరుడు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎనుముల కృష్ణారెడ్డి తన సతీమణితో కలిసి ఆలయ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, వేమారెడ్డి పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి తాగునీరు వృథా



గుట్టలపల్లి సమీపంలో మిషన్‌భగీరథ పైపులైన్ పగిలిపోయి వృథాగా పోతున్న తాగునీరు

తాడూరు, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుట్టలపల్లి గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్ బుధవారం పగిలింది. దీంతో తాగునీరంతా రహదారి పక్కన వృథాగా పోతుండటంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు చేసి, వృథాగా పోతున్న నీటిని ఆపాలని గ్రామస్థులు కోరారు. పైపులైన్ పగిలిపోవడంతో గుట్టలపల్లి గ్రామానికి ఇబ్బందులు తలెత్తాయి.


యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- కర్ణాటక మాజీ డీజీపీ డాక్టర్ పుట్టపాగ రవీంద్రనాథ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ డీజీపీ డాక్టర్ పుట్టపాగ రవీంద్రనాథ్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేటి యువత శ్రీశ్రీ, వివేకానంద వంటి మహనీయులు చెప్పిన స్ఫూర్తిని ఇచ్చే విషయాలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని కర్ణాటక మాజీ డీజీపీ, విశ్రాంత ఐపీఎస్ డాక్టర్ పుట్టపాట రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో ఐక్య సమాజ సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళ్యాణం నరసింహ సభాధ్యక్షత నిర్వహించి ఈ సదస్సుకు ఐక్య సమాజ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పుట్టపాగ రవీంద్రనాథ్‌తో పాటు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి జి.వెంకటరమణ, క్రియేటర్ కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ డీజీపీ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన తన తండ్రి మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ జాతీయోన్నత పాఠశాల స్థాపించి ఎందరో పేద విద్యార్థులకు ఉచిత చదువును అందించి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువతకు బంగారు భవత చూపాలనే లక్ష్యంతో వ్యక్తిత్వ వికాస శిక్షణలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయోన్నత పాఠశాల మాజీ ప్రిన్సిపాల్ అబ్దుల్లాఖాన్, మురళీధర్, నరేందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, అధ్యాపకుడు భగవేణి నర్సింహులు, రాజారాం, వంకేశ్వరం లక్ష్మయ్య, వార్డెన్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మేమింతే.. ● మా రాతలింతే..

అర్థం కాకుండా రాసిన మందుల చీటి

- ప్రిస్క్రిప్షన్‌పై అవే అర్థం కాని రాతలు
- ఎంసీఐ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న వైద్యులు
- అనుబంధ మెడికల్ షాపులకే అర్థమయ్యే గీతలు
- ఆసుపత్రుల్లోని మెడికల్ దుకాణాల్లో దందా

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వైద్యులు తమ చేతిరాతను మార్చుకోవడం లేదు. తమకు ఇష్టమొచ్చినట్లుగా, ఇతరులకు అర్థంకాని విధంగా ప్రిస్క్రిప్షన్‌పై మందులు రాస్తున్నారు. అయితే ఆ రాతలు తమకు అనుబంధంగా ఉండే కొన్ని మెడికల్ దుకాణదారులకే అర్థమవ్వడమే కాకుండా మందులు కూడా అక్కడే తప్పా ఎక్కడా దొరికే పరిస్థితులు లేవు. తమ ఆసుపత్రుల్లోనే మెడికల్ దుకాణాలు పెట్టుకొని ఇష్టారీతిగా మందులు రాస్తూ ప్రజలను ఆర్థిక భారం వైపు నెట్టివేస్తున్నారు. వాస్తవానికి అందరికీ అర్థమయ్యే రీతిలో పెద్ద పెద్ద అక్షరాలతో ప్రిస్క్రిప్షన్ రాయాలని ఎంసీఐ ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని పెడచెవిన పెడుతున్నారు. అవేవి పట్టించుకోకుండా మేమింతే.. మా రాతలు ఇంతే.. అన్న విధంగా వైద్యుల తీరు కనిపిస్తోంది.

● కాసుల కోసం కక్కుర్తి

రోగి బాగోగులు కాపాడాల్సిన వైద్యులు వ్యాపారధోరణిలో ఆలోచిస్తున్నారు. దాదాపు వైద్యులందరు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. మెడికల్ దుకాణాల యజమానులే డాక్టర్‌కు ఓ క్లినిక్‌ను అద్దెకు తీసుకుంటారు. వారే అద్దె భరిస్తారు. వచ్చిన ఫీజు డాక్టర్‌కు ఇచ్చి మందులపై వచ్చే లాభాన్ని ఆయా మెడికల్ షాపుల యజమానులు తీసుకుంటారు. అందువలన డాక్టర్ రాసిన మందులు అక్కడే దొరకడంతో పాటు ఎక్కువ మొత్తంలో మందుల లిస్టు ఉంటుంది. ఇదిలా ఉండగా, కొందరు డాక్టర్లు ఆసుపత్రిని పెట్టి అందులోనే ఓ మెడికల్ షాపును కూడా పెడుతున్నారు. లేదా ఎవరికైనా మెడికల్ షాపు పెట్టుకునేందుకు లీజుకు ఇస్తున్నారు. దీంతో డాక్టరు ఎన్ని మందులు రాస్తే అన్ని మందులు కచ్చితంగా తీసుకోవాలసిందే.

అంతేకాకుండా ఆ మెడికల్ దుకాణాలలో ఉండే మందులనే వారు రాస్తున్నారు.

దాదాపు 1600 మెడికల్ షాపులు..

● జిల్లా వ్యాప్తంగా దాదాపు 1600 పైగా మెడికల్ షాపులు ఉంటాయి. అంతేకాకుండా 350కు పైగా హోల్‌సేల్ మందుల దుకాణాలు ఉన్నాయి. అయితే ఈ దుకాణాలన్నీ సంబంధిత డాక్టర్ క్లినిక్‌కు, ఆసుపత్రికి అనుబంధంగా ఉంటున్నాయి. అక్కడే అసలు కథ మొదలవుతుంది. ఒక రోగి డాక్టర్ వద్దకు వస్తే ముందుగా వారికి కౌన్సెలింగ్ చేయడం, ఆ తర్వాత అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఆ తర్వాత మందులు రాసి ఇవ్వాల్సి ఉంది. కానీ డాక్టర్ తనకు ఇష్టమొచ్చినట్లుగా మందులు రాస్తున్నారు. విచ్చలవిడిగా వివిధ బ్రాండ్ కంపెనీల మందులు, యాంటిబయోటిక్ మందులు రాస్తున్నారు. ఈ మందులు ఆ అనుబంధ మెడికల్ దుకాణంలోనే దొరుకుతాయి. ఎక్కడ తిరిగినా ఆ మందులు దొరకవు. వేరే చోట తీసుకొచ్చే పరిస్థితి ఉండదు. పైగా ఎన్ని రోజులకు రాసినా అన్ని రోజులు కచ్చితంగా తీసుకోవాలి. జ్వరం వచ్చిందని వెళితే ఆరు రకాల మందులు రాసే వైద్యులు చాలా మంది ఉన్నారు.

● వైద్యుల్లో మార్పు రావాలి



జనరిక్ మందులు రాయాలని, అర్థమయ్యే రీతిలో ప్రిస్క్రిప్షన్‌పై మందులు పెద్ద అక్షరాలతో రాయాలని ఎంసీఐ ఆదేశాలు జారీ చేసినా దానికి వైద్యులు తుంగలో తొక్కుతున్నారు. ఎంసీఐ ఒక నిబంధన మాత్రమే తెచ్చింది. దీనిపై చట్టం తెస్తే పక్కాగా అమలు జరుగుతుంది. అయితే ప్రధానంగా ప్రిస్క్రిప్షన్ రాతలపై డాక్టర్లలో మార్పు రావలసిన అవసరం ఉంది.

- దినేష్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

● ఎంసీఐ నిబంధనలు బేఖాతర్...

గతంలో వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో రాసిన మందుల పేర్లు అర్థం కాకపోవడంతో మెడికల్ షాపు యజమాని వేరే రకం మందులు ఇచ్చారు. దీంతో ఆ రోగి మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు గతంలో జరిగాయి. దీంతో భారత వైద్యమండలి(ఎంసీఐ) కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రతీ వైద్యుడు గుండ్రటి అక్షరాలతో, అర్థమయ్యే రీతిలో ప్రిస్క్రిప్షన్‌పై మందులు రాయాలని, అవి కూడా జనరిక్ పేరుతోనే ఉండాలని ఆదేశించింది. దవాఖానాల ప్రచారం కోసం బోర్డింగులు, వాటిపై ఫోటోలు ముద్రించరాదనే నిబంధనలు కూడా వెలుగులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ, ఔషధ నియంత్రణ శాఖలకు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో వైద్యులు ఆడిందే ఆటగా సాగుతోంది. వారికి ఇష్టం వచ్చిన రీతిలోనే ప్రిస్క్రిప్షన్‌పై మందులు రాస్తున్నారు. అవి కూడా వారి క్లీనిక్ అనుబంధంగా ఉండే మందుల దుకాణంలోనే దొరికే విధంగా మందులు రాస్తున్నారు. ఆ రాతలు, గీతలు వారికే అర్థమవుతున్నాయి.

క్రీడా వార్తలు

ఎస్‌జీఎఫ్ క్రీడా టోర్నీలో రాణించాలి

- ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి



ఎస్‌జీఎఫ్ రగ్బీ ఎంపికలను ప్రారంభిస్తున్న సెక్రటరీ శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి క్రీడా టోర్నీలో రాణించాలని ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక స్టేడియం మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-17 బాల, బాలికల రగ్బీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. గత ఏడాది జిల్లా నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని గుర్తుచేశారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా క్రీడాకారులు టోర్నీ ప్రతిభ చాటాలని ఆకాక్షించారు. ఎంపికల్లో భాగంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, నిరంజన్‌రావు పాల్గొన్నారు.

ఈ నెల 14,15న ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15న ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియంలో పోటీలు ఉంటాయని, క్రీడాకారులు ఈ నెల 13లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

జాతీయ, రాష్ట్ర స్థాయికి గురుకుల విద్యార్థుల ఎంపిక



గురుకుల విద్యార్థులతో ప్రిన్సిపాల్

మక్తల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో మక్తల్ గురుకుల విద్యార్థులు కవిత, జిల్లా స్థాయి హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు గురుకుల ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. ఈ విద్యార్థి ఈనెల 14 నుంచి 16వరకు ఖమ్మం జిల్లాలో జరుగు రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటుందన్నారు. అలాగే ఈనెల 1 నుంచి 3వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి సోషల్ వెల్ఫేర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో సంగంబండ గురుకుల పాఠశాల విద్యార్థులు నందిని పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారు. అలాగే గత నెలలో జరిగిన జాతీయ స్థాయి 14ఏళ్లలోపు చెస్ పోటీల్లో ప్రగతి పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి
- తాండ్రలో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో 68వ ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు బుధవారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన క్రీడాకారులు గురువారం ఖమ్మంలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జాంగీర్, ఉమ్మడి జిల్లా పరిధిలోని పీఈటీలు తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



క్రీడల్లో సత్తా చాటి మొదటి స్థానం సాధించిన మాగనూరు విద్యార్థులకు మెడల్స్, ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు

మాగనూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి, క్రీడల్లో మొదటి స్థానం సాధించారని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో మాగనూరు నుంచి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని నిహారీక లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో, 9వ తరగతి చదువుతున్న శ్రావణి డిస్కస్‌త్రోలో మొదటి స్థానం, తొమ్మిదవ తరగతి చదువుతున్న అఖిల 100 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం, 9వ తరగతి చదువుతున్న శివ మూడవ స్థానంలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ రాకేష్‌శర్మ తెలిఆరు. గెలుపొందిన విద్యార్థులను ఎంఈవో, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జడ్చర్ల విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జడ్చర్ల, నవంబరు 6: రాష్ట్రస్థాయి పోటీలకు జడ్చర్ల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు సిద్దిపేట జిల్లాలో నిర్వహించే హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన అండర్-14 విభాగంలో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో లాలు, తరుణ్, అరవింద్‌లు, బాలికల విభాగంలో అనూష ఎంపికయ్యిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. అలాగే ఈ నెల 7 నుంచి 9వ తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు డేగావత్ జయశ్రీ ఎంపికయ్యిందని తెలి పారు. అలాగే జడ్చర్ల పట్టణంలోని తెలంగాణ గిరిజన మినీ గురుకు ల పాఠశాల విద్యార్థి యువరాజ్ రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీ లకు ఎంపికయ్యారని ఏటీడీవో చీన్యానాయక్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలల ఆవరణలో ఉపాధ్యాయులు అభినందించారు.

కొండాపూర్ విద్యార్థులు..

ధన్వాడ(ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10 వర కు 68వ రాష్ట్ర స్థాయి క్రీడా సమాఖ్య పోటీ లు ఉమ్మడి మహబూ బ్‌నగర్, జోగుళాంబ గద్వాల జోన్ తరఫున కొండాపూర్ విద్యార్థులు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. వివిధ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్‌లో జరిగే అండర్-19 బాస్కెట్‌బాల్ లో పి.శ్రీను, గణేష్, ఆదిలాబాద్‌లో జరిగే అండర్-19 స్పార్క్ బాల్ పో టీలకు ప్రవీణ్, లోకేష్, విష్ణు, రంగారెడ్డిలో జరిగే అండర్-19 ఖో-ఖోలో శ్రీకాంత్, అరుణ్, లక్ష్మణ్, వరంగల్‌లో జరిగే అండర్-17 యోగాసనం లో సురేష్, విష్ణు, సిద్దిపేటలో జరిగే అండర్-14 హ్యాండ్‌బాల్‌లో దినే ష్, హైదరాబాద్‌లో జరిగే అండర్-19 హ్యాండ్‌బాల్‌లో అరుణ్, హైద రాబాద్‌లో జరిగే అండర్-17 రెజ్లింగ్‌లో వీరేష్, మధు రాజేష్, హైదరాబాద్‌లో జరిగే అండర్-14 బాస్కెట్ బాల్‌లో అశోక్, రాజేష్, రంగారెడ్డిలో జరిగే అండర్-17లో దినేష్, అరుణ్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల ప్రిన్సిపాల్‌తో పాటుగా కోచ్ రాంమోహన్‌గౌడ్ అభినందించారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు


ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు


ఊరేగింపులో ఆకట్టుకున్న పలకల కోళ్ల విన్యాసం


కురుమూర్తి స్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో కూర్చున్న ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి


అమరచింతలో మగ్గం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


ఆలయ ప్రాంగణంలో స్వామి వారి బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న పాలకవర్గ సభ్యులు, అధికారులు

కాంచన గుహకు బంగారు కాంతులు

» వైభవంగా కురుమూర్తి స్వామి అలంకారోత్సవం » ఆత్మకూరు ఎస్‌బీఐ నుంచి ఆభరణాల ఊరేగింపు

చిన్నచింతకుంట, ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలో అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో తొలి ఘట్టమైన స్వామి వారి అలంకారోత్సవాన్ని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నుంచి కురుమూర్తి స్వామి కొలువైన దేవరగట్టు వరకు నిర్వహించిన ఊరేగింపు ఘనంగా కొనసాగింది. అంతకు ముందు వనపర్తి జిల్లా ఆత్మకూరు ఎస్‌బీఐలో భద్ర పరిచిన ఆభరణాల పెట్టెకు మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, జి.మధు సూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాడి వంశానికి చెందిన స్వర్ణకారులు ఆభరణాల పెట్టెను తలపై పెట్టుకొని ముందు నడవగా, ఊరేగింపు ప్రారంభం అయ్యింది. ఎస్‌బీఐ నుంచి గాంధీ చౌరస్తా మీదుగా ఆత్మకూరు పరమేశ్వరస్వామి చెరువు కట్ట వరకు ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆభరణాల పెట్టెను దర్శించుకున్నారు. ఊరేగింపులో పలుకల కోలు,


స్వర్ణాభరణాల అలంకరణలో స్వామివారు

కట్టె కోళ్లు, భజన కీర్తనలు, కేరళ రాష్ట్ర కళాకారులు ప్రదర్శించిన డోలు దరువు అందరినీ ఆకట్టుకున్నాయి. శివసత్తుల పూనకాల నడుమ ఊరేగింపు కొనసాగింది. చెరువు కట్ట మీదుగా ఊరేగింపు మదనాపురం మండలం కొత్తపల్లికి చేరుకున్నది. ఈ సందర్భంగా గ్రామస్థులు, భక్తులు పూలు చల్లుతూ వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం దుప్పల్లి మీదుగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అమ్మాపురం గ్రామంలోని ముక్కెర వంశానికి చెందిన రాజా రాంభూపాల్ నివాసానికి చేరుకున్నది. అక్కడ వేద పండితులు, అర్చకులు ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేశారు. మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతిపతినిధులు ఆభరణాల పెట్టెను దర్శించుకున్నారు. అక్కడి నుంచి అమ్మాపురం ప్రధాన రహదారి మీదుగా సాయంత్రం ఆరు గంటల సమయంలో ఊరేగింపు జాతర మైదానంలోని ప్రధాన రాజగోపురం గుండా దేవర గుట్టకు చేరుకున్నది. అనంతరం ఆలయ ఆవరణలో ఈవో, చైర్మన్, పాలకమండలి సభ్యులు, అధికారులు, అర్చకుల సమక్షంలో పెట్టెను తెరిచి బంగారు ఆభరణాలను ఒకొక్కటి తీస్తూ పరిశీలించారు. ఆ తర్వాత రాత్రి బంగారు కిరీటం, భుజకీర్తులు, శంఖు చక్రాలు, కోరమీసం, మొలగజ్జలు, పచ్చలు, ముత్యాల హారాలను స్వామి వారికి అలంకరించారు. ఆ సమయంలో కాంచన గుహ స్వర్ణ కాంతులతో విరాజిల్లింది.

ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ నేతృత్వంలో 80 మంది పోలీసు బృందం బందోబస్తు నిర్వహించింది. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్, నారాయణ పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కురుమూర్తి రాయుడు.. దాసంగాల దేవుడు

» కొత్తకుండలో అన్నం, పచ్చి పులుసు నైవేద్యం
» బ్రహ్మాండ నాయకుడికి ఇదే పరమాన్నం


స్వామి వారికి సమర్పించేందుకు సిద్ధం చేసిన దాసంగాలు

చిన్నచింతకుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి వేంకటేశ్వర స్వామిని భక్తులు దాసంగాల దేవుడని పిలుచుకుంటారు. స్వామి వారికి సమర్పించే నైవేద్యాన్నే దాసంగాలు అంటారు. ఇది స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైనదని భక్తుల విశ్వాసం. భక్తులు కొత్త కొండలో అన్నం, పచ్చి పులుసు వండి దేవదేవుడికి సమర్పిస్తారు.

భక్తి శ్రద్ధలతో నైవేద్యం తయారీ

స్వామి వారికి నైవేద్యాలను సిద్ధం చేసుకునేందుకు ముందు భక్తులు గుట్ట కిందనున్న కోనేరులో పుణ్యస్నానాలు చేస్తారు. అనంతరం అక్కడే కొత్త కొండ కొనుగోలు చేసి, అందులో అన్నం వండుతారు. ఆ తర్వాత పచ్చి పులుసు తయారు చేస్తారు. అక్కడ ఉన్న దాసరులతో కుండకు బొట్లు పెట్టిస్తారు. గోవిందా.. గోవిందా... కురుమూర్తివాసా గోవిందా.. అంటూ నామస్మరణ చేస్తూ భక్తులను ఆశీర్వదిస్తారు. ఆ తర్వాత భక్తులు దేవరగట్టు వైపు తిరిగి, కురుమూర్తి వాసా.. కరుణించవయ్యా అని స్వామిని తలుచుకొని తమ కోరికలను వ్యక్తం చేస్తారు. అనంతరం అన్నం పచ్చి పులుసు కలిపి అక్కడే పరిశుభ్రమైన స్థలంలో విస్తరిలో వడ్డించి స్వామికి నైవేద్యాన్ని సమర్పిస్తారు. అనంతరం దీపాలు వెలిగించి టెంకాయ కొడతారు. ఆ తర్వాత కొండపైకి వెళ్లి కాంచనగుహలో స్వామిని దర్శించుకొని పూజలు చేస్తారు.

పల్లెలు, పట్టణాల నుంచి భక్తుల రాక

కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు పల్లెలతో పాటు సుదూర ప్రాంతాల్లోని పట్టణాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. స్వామి వారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. సమీప గ్రామాల ప్రజలు ఎద్దుల బండ్ల మీద రావడం ఆనవాయితీ. కొందరు కాలినడకన కూడా వస్తారు. కుటుంబసమేతంగా దాసంగాలు నైవేద్యం పెట్టి, వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

పట్టు వస్త్రాల సమర్పణ

» అమరచింతలో భక్తి శ్రద్ధల మధ్య కొనసాగిన ఊరేగింపు
» కురుమూర్తి నామస్మరణతో మారుమోగిన పట్టణం

అమరచింత, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి వేంకటేశ్వర స్వామి నామస్మరణతో పట్టు వస్త్రాల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. వనపర్తి జిల్లా అమరచింత చేనేత కార్మికులు పక్షం రోజుల పాటు నిష్ఠతో స్వామికి పట్టు పంచె, పట్టు కండువా, పట్టు కోర్చు, అమ్మ వారికి పట్టు చీర, పట్టు రవికె, కండువాలను సిద్ధం చేశారు. ఆనవాయితీ ప్రకారం అలంకారోత్సవం రోజున వాటిని స్వామివారికి సమర్పిస్తారు.

అందుకోసం బుధవారం ఉదయం పట్టు వస్త్రాలకు కురుమూర్తి ఆలయం నుంచి వచ్చిన అర్చకులు పూజలు చేశారు. అనంతరం మార్కండేయ స్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలను దేవరకొండ మోహన్, నామాల నరేష్, గోవర్ధన్, దోమరవి విడతల వారీగా తలపై పెట్టుకుని ఊరేగింపుగా కురుమూర్తి కొండకు చేరుకున్నారు. కాంచన గుహలో కొలువుదీరిన కురుమూర్తి స్వామికి వస్త్రాలను సమర్పించారు. బాణసంచా మోతలు, మంగళ వాయిద్యాల ఘోష నడుమ ఊరేగింపు కొనసాగింది.

కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ కల్లు గీత సంఘం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు దేవరకొండ లచ్చన్న, మేర్వ రాజు, క్యామ భాస్కర్, మహేందర్ రెడ్డి, చింతన్న, తాటికొండ విజయ్, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, మ్యేడం కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో విద్యా వ్యవస్థకు తీరని నష్టం

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో విద్యా వ్యవస్థకు తీరని నష్టం చేసిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నూతన బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆయన వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. భవనం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. కొత్త కోర్సులను దృష్టిలో ఉంచుకొని మరిన్ని భవనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మరో రెండేళ్లలో యూనివర్సిటీలోని అన్ని భవనాల నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీర్వాదాలతో పీయూ ఈ స్థాయికి చేరుకున్నదని చెప్పారు. .కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యూజీసీ నుంచి ప్రత్యేక నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హామీ ఇచ్చారు. జిల్లాలోని పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది పడ కుండా, ఇక్కడే అన్ని కోర్సులను అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, ఎం.సురేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖలో దుమారం

(మొదటి పేజీ తరువాయి)

పని చేయబోయే జిల్లాలో సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలా జరగలేదనే ప్రచారం ఉంది.

రాజకీయ ఆధిపత్యపోరు..

వనపర్తి జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా పని చేయాలంటే ఎవరైనా జంకుతున్న పరిస్థితి ఉంది. ఇక్కడ ధాన్యం సేకరణతో పాటు పైరవీలు, ఒత్తిళ్లు కూడా ఎక్కువగానే ఉంటుండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రస్తుతం ఇక్కడకు బదిలీ అయిన వైపీ రమేష్.. ఎక్కువ సేకరణ ఉన్న నిజామాబాద్ జిల్లాలో డీఎంగా పనిచేశారు. కాబట్టి ఆయనకు ధాన్యం సేకరణలో అనుభవం లేదనే సాకు సరిపోదు. ప్రస్తుత డీఎంపై గతంలో నుంచి ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ ధాన్యం బదలాయింపుల్లో అవినీతి ఆరోపణలతోపాటు.. రెండుసార్లు ఆయన ఇతర జిల్లాల్లో పని చేసిన సమయాల్లో సస్పెండ్ కూడా అయిన్నట్లు సమాచారం ఉంది. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సైతం.. ఒకసారి పౌరసరఫరాల శాఖలో అవినీతిపై దృష్టి సారించాలని కలెక్టర్‌కు సూచించినట్లు సమాచారం. ఆ శాఖలో వేధింపులు తగ్గడం లేదని మిల్లర్లు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఓ మారు రైస్ మిల్లర్లు ధర్నా కూడా చేశారు. ఇప్పటికే ధాన్యం సేకరణ సీజన్ ముంచుకొస్తున్న తరుణంలో ఈ దుమారం చెలరేగడం, ఒక్క మిల్లుతో కూడా అగ్రిమెంట్ చేసుకోకపోవడం వంటి పరిణామాలు ఎదురవుతున్నాయి. కొందరు మిల్లర్లు ప్రస్తుత అధికారి వల్ల వేధింపులు ఎక్కువవుతున్నాయని, ఆయన ఉండగా అగ్రిమెంట్లు చేసుకోబోమని బాహాటంగానే చెబుతున్నారు. అయితే రాజకీయంగా కూడా ఇది విమర్శలకు తావిస్తోంది. నచ్చిన అధికారులను తెచ్చుకున్నారని కొందరు.. నచ్చకనే బదిలీ ఆపుకున్నారని మరికొందరు విమర్శలు చేసుకుంటున్నారు. వనపర్తిలో ఎప్పటి నుంచో ఉన్న రెండు వర్గాల కుమ్ములాటలకూ ఇది వేదికగా మారింది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాల్సిన అధికారులు అవేమీ లేవని చెబుతూనే ఆ రొంపిలోకి దిగిపోయి, అబాసుపాలవుతున్నారు.

వెళ్తారా? ఉంటారా?

ప్రస్తుతం పని చేస్తున్న డీఎం ఇర్ఫాన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తన డ్యూటీ ఇక్కడే అని, ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ క్యాన్సిల్ అయ్యిందని, తన పని తాను చేసుకుంటుంటే ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. కాగా, ఇక్కడికి బదిలీ అయిన వైపీ రమేష్ సోమవారం జాయినింగ్ కోసం వచ్చారు. డీఎంగా అనుభవం ఉన్నప్పటికీ.. ఇంతకంటే ఎక్కువ ప్రొక్యూర్‌మెంట్ ఉన్న జిల్లాలో పనిచేసినప్పటికీ.. అనుభవం లేదనే సాకుతో చెప్పి వెనుదిరిగారు. అయితే ఆయన ఇంకా పౌరసరఫరాల కమిషరేట్‌లో రిపోర్ట్ చేయలేదు. ఆయన రిపోర్టు చేస్తేనే ఆ ఆర్డర్ క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

అయితే ఇక్కడ మాత్రం కేవలం ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బంది కావొద్దనే సాకుతోనే రెండు నెలలపాటు ఉత్తర్వులు నిలిపివేయాలని ఉన్నతాధికారులను జిల్లా అధికారులు అభ్యర్థించినట్లు తెలుస్తోంది. అసలు కారణం వేరే ఉన్నా.. ఇతర సాకులతో ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలుస్తోంది. ఈ దుమారం మధ్య ఆయన వెళ్తారా? ఉంటారా? అనే చర్చ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది.

డీఎంపై చర్యలు తీసుకోవాలి

» బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

వనపర్తి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం ఇర్ఫాన్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. వనపర్తి కలెక్టరేట్ ముందు బుధవారం ఆయన మీడియాతో ఆయన మాట్లాడారు. ఇర్ఫాన్ పని చేసిన ప్రతీ చోట అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఇప్పటికే రెండు సార్లు సస్పెండ్ అయ్యారని తెలిపారు. అయినా తీరు మార్చుకోకుండా వనపర్తిలోను అవినీతి జోరు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఆయనను ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసినా, నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. డబ్బు కోసం మిల్లర్లను కూడా ఒత్తిడికి గురి చేస్తున్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇర్ఫాన్‌పై వెంటనే చర్యలు తీసుకోకపోతే సివిల్ సప్లయ్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్ గౌడ్, మహేందర్‌నాయుడు, శివశంకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మినీ టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మద్దూర్, నవంబరు (ఆంధ్రజ్యోతి) మినీ టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రాంలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కిష్టప్ప (48) ద్విచక్రవాహనంపై మద్దూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా దేవరగట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న మినీ టిప్పర్ ఢీకొన్నది. ప్రమాదంలో కిష్టప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఐపై దాడి కేసులో నలుగురికి జైలు శిక్ష

అమ్రాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఐపై దాడికి పాల్పడిన నలుగురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. అమ్రాబాద్ ఎస్ఐ రజిత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో 2017, జూన్ 23న పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తుండగా, మన్ననూరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి, రాజిరెడ్డి, సల్మాన్, జావిద్ పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వారు అప్పటి ఈగలపెంట ఎస్ఐ కృష్ణయ్యపై దాడి చేసి గాయపరిచారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసు బుధవారం నాగర్‌కర్నూల్ సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. నిందితులకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఒకొక్కరికి ఏడు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి సబిత తీర్పునిచ్చారు.

కట్నం కోసం వేధించిన అత్తింటి వారికి ఏడాది జైలు

మన్ననూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తతో పాటు అతడి సోదరుడు, అత్తలకు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన సంధ్యాబాయికి అచ్చంపేటకు చెందిన నేనావత్ శివకుమార్‌తో 2021లో వివాహమైంది. ఆ తర్వాత కొద్ది రోజులకే భర్తతో పాటు, అతడి తల్లి రాజేశ్వరి, సోదరుడు శ్రీకాంత్ ఆమెను అదనపు కట్నం తేవాలంటూ వేధించి, దాడి చేసి గాయపరిచారు. సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి అచ్చంపేట ఎస్ఐ ప్రదీప్ కేసు నమోదు చేశారు. బుధవారం ఈ కేసులో వాదోపవాదాలు విన్న తరువాత సంధ్యాబాయి భర్త శివకుమార్, అతడి తల్లి రాజేశ్వరి, సోదరుడు శ్రీకాంత్‌లకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి సబిత తీర్పు వెల్లడించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

» సమీక్షా సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ చెన్నారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ చెన్నారెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ చెన్నారెడ్డి ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఈ జగన్ మోహన్, ఈఈలు, డీఈలు, ఏఈలతో కలిసి తాగునీరు, పైప్ లైన్ల మరమతు, నీటి శుద్ధీకరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏఈలు తమ పరిధిలోని గ్రామాల్లో క్రమం తప్పకుండా పర్యటించి, సమస్యలను గుర్తించాలన్నారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామానికి బ్లీచింగ్ పౌడర్‌ను పంపిణీ చేయాలన్నారు. 10 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేసేలా గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించాలన్నారు. వాటర్ గ్రిడ్, వాటర్ ఇంట్రాలో విధులు నిర్వర్తించే అధికారులకు వేర్వేరు బాధ్యతలు ఉంటాయని తెలిపారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు సీనియర్ అధికారుల నుంచి పని విధానాన్ని తెలుసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. పనిలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. నారాయణపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. గతంలో సూచించిన పనులు చేయని అధికారులను మందలించారు. సమావేశంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట ఈఈలు వెంకట్ రెడ్డి, సుధాకర్‌సింగ్, ఎం పుల్లారావు, రాంగారెడ్డి, రంగారావు పాల్గొన్నారు.

ఎల్లికల్‌లో సూక్ష్మ హనుమంతుడి విగ్రహం

» పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామంలోని శివాలయంలో నాలుగు వందల ఏళ్ల నాటి అతి చిన్న ఆంజనేయస్వామి విగ్రహం ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బంధువు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం ఆయన ఎల్లికల్ శివారులోని శివాలయాన్ని పరిశీలించారు. శిథిలమైన ఆలయంలో మూడు నంది విగ్రహాలు, కప్పుకూలిన మండపాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆలయ ధ్వజస్తంభ పీఠంపై ఆరు అంగుళాల ఎత్తు, నాలుగు అంగుళాల వెడల్పు, రెండు అంగుళాల మందం ఉన్న సున్నపురాయితో చెక్కిన సూక్ష్మ ఆంజనేయస్వామి విగ్రహం ఉందని తెలిపారు. ఇవే కొలతలతో వినాయకుడి విగ్రహం కూడా ఆయన పేర్కొన్నారు. విజయనగర రాజుల కాలానికి చెందిన ఈ చిన్న శిల్పాలు అత్యంత అరుదైనవని చెప్పారు. వీటిని కాపాడి భావితరాలకు అందించాలన్నారు. పురాతన ఆలయాలను, శిల్ప సంపదను సంరక్షించుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు మామిడాల ముత్యాల్‌రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.


సూక్ష్మ ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూపిస్తున్న శివనాగిరెడ్డి

న్యూస్ బాక్స్

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధరలు

దేవరకద్ర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వారంతో పోలిస్తే ఈవారం ఉల్లి ధరలు స్వల్పంగా పెరిగాయి. దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పండించిన ఉల్లి విక్రయించేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావాదేవీలలో గతనెల రోజులుగా ఉల్లి ధరలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. వ్యాపారస్తులు నిర్వహించిన వేలంలో గరిష్ఠంగా రూ.3600, కనిష్ఠంగా రూ.1100 ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరి జయశ్రీ తెలిపారు. ఉల్లిని విక్రయించేందుకు వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా నాణ్యంగా ఉన్న వాటికి కొంతవరకు డిమాండ్ ఉండగా, ఇక ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. మార్కెట్‌కు ఎక్కువగా ఎర్రఉల్లి అమ్మకానికి వచ్చింది. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్రఉల్లిని కొనుగోలు చేశారు. గతవారం కంటే ఈవారం ఉల్లిధరలు రూ.వెయ్యి పెరిగింది. మార్కెట్‌కు 15క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మిడ్జిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, విద్యార్థుల సమస్యలను పరిష్కారించాలని ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ వడ్డె శేఖర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఏబీవీపీ మండల కన్వినర్ అజయ్‌తో కలిసి వడ్డె శేఖర్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యధోరణిని ప్రదర్శిస్తుందని కోరుతూ ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మేఘన, మణికాంత్, సిద్దు తదితరులున్నారు.

ధాన్యంతో మార్కెట్ కళకళ

దేవరకద్ర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం ధాన్యంతో మార్కెట్ కళకళలాడింది. ఆర్ఎన్ఆర్‌కు గరిష్ఠంగా రూ.2,159, కనిష్ఠంగా రూ.1,801, పెద్ద హంస గరిష్ఠంగా రూ.1,901, కనిష్ఠంగా రూ.1,849, శ్రీరామగోల్డ్ గరిష్ఠంగా రూ.2,501, కనిష్ఠంగా రూ.2,499, కందులు గరిష్ఠంగా రూ.5,839, కనిష్ఠంగా రూ.5,838 ధర పలికింది. ఆర్ఎన్ఆర్ రూ.2,284 క్వింటాళ్లు, శ్రీరామ గోల్డ్ 4క్వింటాళ్లు, కందులు 8 క్వింటాళ్లు, పెదహంస 106 క్వింటాళ్లు, అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

పూర్తి స్థాయిలో సర్వే చేపట్టాలి



వెన్నాచేడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో ముసాయిదా బేగం

గండీడ్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పూర్తి స్థాయిలో సర్వే చేపట్టాలని డిప్యూటీ సీఈవో ముసాయిదాబేగం అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెన్నాచేడ్, పెద్దవార్వల్, రుసంపల్లి, సల్కర్‌పేట్ తదితర గ్రామాల్లో ఇంటింటి సమగ్ర సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవన్న, ఎంఈవో జనార్దన్, దయానంద్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

● కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామదాసు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్డీవో, ఎస్‌టీవోలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, ఎన్.కిష్టయ్య, ఆంజనేయులు నరసింహ, రాములు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం; కేసు నమోదు

మిడ్జిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగొమ్ములకు చెందిన బూషమోని బంగారు మంగళవారం మిడ్జిల్ వెళ్లి ఇంటికి తిరిగిరాలేదని అతని అన్న నిరంజన్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. బంగారు తనతల్లి బాలమ్మతో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని ఏపీజీవీబీకి వెళ్లి తన తల్లిని ఇంటికి పంపాడు. తర్వాత ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు.

సర్వే పత్రాలు జాగ్రత్తగా చూసుకోవాలి

- కోయిలకొండ, భూత్పూర్ మండలాల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్ల పరిశీలన - మల్కాపూర్‌లో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



భూత్పూరు: కర్వెనలో ఓ ఇంటికి స్టిక్కర్ వేస్తున్న అధికారులు



కోయిలకొండ: మల్కాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

కోయిలకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సామాజిక సర్వేపై నిర్లక్ష్యం చేయకుండా సర్వే పత్రాలను జాగ్రత్తగా ఉంచాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. బుధవారం మండలంలోని మల్కాపూర్‌లో ఆర్థిక, సామాజిక సర్వేను పరిశీలించారు. అధికారులు సర్వే నిర్వహిస్తుండగా కలెక్టర్ వాటిని పరిశీలించారు. ఇంతలో సర్వేపత్రాలు చిందర వందరగా పడడంతో కలెక్టర్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సర్వేపత్రాలు జాగ్రత్తగా ఉంచాలని తెలియదా అని ప్రశ్నించారు. సర్వే గురించి మండల అధికారులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం మండలంలోని ఆచార్యపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజా గణేశ్, ఎంపీడీవో కాళప్ప, ఎంఈవో వెంకట్‌జీ, సర్వే సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఏపీఎం మల్లేష్ ఉన్నారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

భూత్పూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో 47మంది ఎన్యుమరేటర్లు 18 గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లు వేశారు. మునిసిపాలిటీ పరిధిలోని 10వార్డుల్లో 23మంది సర్వే పనుల్లో పాల్గొన్నారు. మొత్తం 70మంది ఎన్యుమరేటర్లు, ఏడుగురు సూపర్‌వైజర్లుగా పని చేశారు. ఈసందర్భంగా రెవెన్యూ శాఖ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు మండలంలోని అన్నాసాగర్, పోతులమడుగులో సర్వేను పరిశీలించారు. అంతకుముందు అన్నాసాగర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ఏవో మురళీధర్‌తో కలిసి పరిశీలించారు. సర్వేను మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీడీవో ప్రభాకరచారి, తహసీల్దార్ రహమాన్ సూపర్‌వైజర్లుగా పర్యవేక్షించారు.

జడ్చర్ల మండలంలో జడ్పీ సీఈవో



జడ్చర్ల: మల్లెబోయిన్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి

జడ్చర్ల (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మున్సిపాలిటీ, మండలంలో బుధవారం సర్వే ప్రారంభమైంది. మల్లెబోయిన్‌పల్లి, జడ్చర్ల మున్సిపాలిటీలోని కొత్త తండాలలో జడ్పీ సీఈవో వెంకటరెడ్డి సర్వే ప్రక్రియను పరిశీలించారు. జడ్చర్ల మున్సిపాలిటీలో 18వేల ఇళ్లు ఉన్నాయని, 121 బ్లాక్‌గా ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. సర్వేలో 121మంది ఎన్యుమరేటర్‌లు, 12మంది సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారని తెలిపారు. జడ్చర్ల మండలంలో 15,228 ఇళ్లు ఉన్నాయని, 106 మంది ఎన్యుమరేటర్‌లు 10మంది సూపర్‌వైజర్‌లను నియమించినట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీడీవో విజయ్‌కుమార్‌తో పాటు మున్సిపాలిటీలో కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

వారి తప్పిదం వల్లే ఉద్యమకారులపై కేసులు

- టీజేఏసీ మాజీ చైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ టీజేఏసీ చైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి

పాలమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు అధికారంలో ఉండి తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయకపోవటం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదమేనని మాజీ టీజేఏసీ చైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై మోపిన కేసులను ఏ పద్ధతిలో పరిష్కరించుకోవాలి, ఎదుర్కోవాలనే దానిపై బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో ప్రత్యేక చర్చావేదిక నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎం.రాఘవాచారి, న్యాయవాది ఎస్.వినోద్‌కుమార్, ఆర్‌టీసీ నాయకులు రాజసింహుడు, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో లెక్కలేనన్ని కేసులు నమోదైతే పలు విధాలుగా కోర్టుల్లో వాయిదాలకు హాజరై అనేక కేసులు మాఫీ చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొన్నిటిని మాఫీ చేయగా ఆర్‌టీసీ డిపో, బస్టాండ్‌లో ఇతరచోట్ల కొన్ని కేసులను గత ప్రభుత్వం 2022లో గుర్తించింది. అదే సమయంలో సమన్లు జారీ చేస్తే కేసులో ఉన్న వారికి అందజేయటానికి మరో రెండేళ్లు పట్టడం ప్రభుత్వం చేసిన తప్పిదమన్నారు. 2011లో జరిగిన సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యమకారులపై మోపిన కేసులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రభుత్వంతో కలుస్తామని న్యాయవాది వినోద్‌కుమార్ తెలిపారు. బస్సులను అడ్డుకున్నారనే నెపంతో పోలీసులు పెట్టిన కేసులను ఎలా ఎదుర్కోవాలో కోర్టులో, ప్రభుత్వంతో ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేసును ఉచితంగా వాదిస్తానని భరోసా ఇచ్చారు. కేసులో ఉన్నవారంతా నవంబరు 19న తప్పకుండా మొదటిసారి హాజరుకావాలని సూచించారు.

కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రానాయక్, పెన్షనర్స్ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, ఆర్‌టీసీ రిటైర్డ్ నాయకులు రాజసింహుడు, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, టీఎన్‌జీవోస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు



పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర

రాజాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిరుమలపూర్‌లోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, చైల్డ్ హెల్ప్‌లైన్-1098పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి డి.ఇందిర ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక దాడులు, బాల్యవివాహాలను నిర్మూలించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, బాలల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శివకుమార్, డీసీపీయూ దశరథ్, ఎంఈవీ సుధాకర్, యాదగిరి, పలుశాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



వెన్నాచేడ్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గండీడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెన్నాచేడ్, చిన్నవార్వల్, రుసుంపల్లి, కొంరెడ్డిపల్లి, మన్సూర్‌పల్లి, కొంరెడ్డిపల్లి, ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో దేవన్న, ఏపీఎం బాలకృష్ణ, మాజీ సర్పంచులు గోపాల్, అనంతలక్ష్మారెడ్డి, చిన్నయ్య, వెంకటయ్య, పులిందర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, బస్వరాజ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వస్పుల, దోనూరు గ్రామాలలో..

మిడ్జిల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని వస్పుల, దోనూరు గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బాదేపల్లి మార్కెట్ చైర్మన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి స్థానిక నాయకులు, రైతులతో కలిసి బుధవారం ప్రారంభించారు.

రైతులందరూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాలలోని మార్కెట్ చైర్మన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, డైరెక్టర్ సత్యంగౌడ్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఏఈవో సాయికృష్ణ, మార్కెట్ డైరెక్టర్ సత్యంగౌడ్, నాయకులు బరిగెల వెంకటయ్య, సాయులు, గౌస్, నర్సింహ, వెంకటయ్య, కృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి

నేటి నుంచి నీటి సరఫరా నిలిపివేత

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలంలోని మల్లెబోయిన్‌పల్లి నీటిశుద్ధి కేంద్రానికి మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ ఈఈ వెంకట్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి శేరిపల్లి-బి స్టేజీ బ్లాక్‌స్పాట్ వద్ద రోడ్డు వెడల్పు పనుల కారణంగా పైపులైన్‌ను మార్చే పనులు చేపట్టారని, ఈ పనులు పూర్తి కావడానికి మూడు రోజులు పడుతుందని పేర్కొన్నారు. ఈనెల 7 ఉదయం 8గంటల నుంచి, 10వ తేదీ ఉదయం 8గంటల వరకు నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీ, దివిటిపల్లి సమీపంలోని డబుల్‌బెడ్రూం ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని తెలిపారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

దేవరకద్ర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మరో రెండు రోజులు అధికారులు ఇళ్ల దగ్గరకు వెళ్లి సర్వే స్టిక్కర్‌లను అతికిస్తారని, 9 నుంచి సర్వే నమోదు చేసుకోవడానికి సర్వే అధికారులు వస్తారని తెలిపారు. ప్రజలు ఇంటి దగ్గర ఉండి వివరాలను తెలియజేయాలన్నారు. బుధవారం అధికారులు ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు వేస్తున్నారు.

ఈఎంటీ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్‌లో ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగం కోసం ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రోగ్రాం మేనేజర్ రవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, బీఎస్సీ(బిజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్, బీ ఫార్మసీ విద్యార్హత ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఈనెల 9న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని 108 అంబులెన్స్ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

ట్రాక్టర్, వ్యాన్ ఢీ: ఇద్దరికి గాయాలు

బాలానగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతిరెడ్డిపల్లి శివారులోని జాతీయ రహదారిపై మినీ డీసీఎం వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మాచర్లలో రాతి కడీల లోడ్‌తో ట్రాక్టర్ షాద్‌నగర్ వైపు వెళ్తుండగా కేతిరెడ్డిపల్లి శివారులో వెనక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొంది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడి కృష్ణయ్య అఫ్జల్ గాయపడ్డారు. స్థానికులు వారిని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అఫ్జల్ అన్న సుల్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపాజి తెలిపారు.

వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి : ఎమ్మార్పీఎస్

పాలమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కావలిక్రిష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 7వ తేదీన జిల్లా కేంద్రంలోని విజన్‌గార్డెన్‌లో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చేందుకే ఉమ్మడి జిల్లా స్థాయిలో మహాసభ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆంజనేయులు, ప్రభాకర్, నరసింహ, రామచంద్రయ్య, బండారి రాములు, కావలిరాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాల కోసమే సమగ్ర సర్వే



సర్వే గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలమూరు పురపాలిక పరిధిలోని ఏనుగొండలో సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా ప్రయోజనాలు కల్పించేందుకు సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అధికారులకు పూర్తి వివరాలు తెలియజేయాలని ప్రజలను కోరారు. అనంతరం సర్వే స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిరబోయి, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, అనిత, వనజ, తిరుమల వెంకటేశ్, ఖాజాపాష, శాంతయ్య, రామస్వామి, కిరణ్, మంజుల వెంకటేశ్‌గౌడ్, పురుషోత్తం, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

హన్వాడ, (ఆంధ్రజ్యోతి): రైతుల మేలు కోరే ప్రభుత్వం మాది అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం హన్వాడ రైతు సేవ సహకార సంఘం వద్ద, ఇబ్రహీంబాద్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను, హన్వాడలో కుటుంబ సమగ్ర సర్వేను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, పీడీ నర్సిములు, తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీవో యశోద, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, సొసైటీ చైర్మన్ వెంకటయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు కృష్ణయ్య, యాదయ్య యాదవ్, లింగం నాయక్, రాములు, వెంకటయ్య ఖాలీం, నవనీత, ఆంజనేయులు, స్వరుపారెడ్డి, కిరణ్‌రెడ్డి, కృష్ణయ్య గౌడ్ పాల్గొన్నారు.

దివిటిపల్లిలో..

మహబూబ్‌నగర్ రూరల్: దివిటిపల్లి రైతువేదిక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కావాలనే రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. తాము రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మన్ యాదవ్, మార్కెట్ చైర్‌పర్సన్ బెక్కరి అనిత డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, చంద్రశేఖర్, సిరాజ్‌ఖాద్రీ, పెద్ద విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎన్ఎల్ఎం బృందం పరిశీలన



అచ్చాయిపల్లి పాఠశాలలో విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న మానిటరింగ్ బృందం సభ్యులు

మూసాపేట, నవంబరు 6: మండలంలోని అచ్చాయిపల్లి, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం (ఎన్ఎల్ఎం)నేషనల్ లేవల్ మానిటరింగ్ టీమ్ పర్యటించి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అధ్యయనం చేసి పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి స్వయం సహాయక సంఘాల సమావేశాల నిర్వహణ, ఎజెండా అంశాలు, సంఘాల ద్వారా రుణాలు పొంది చేపడుతున్న కార్యకలాపాలు, వాటి నిర్వహణతో వచ్చే లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వయం ఉపాధి రంగాల్లో మహిళాసంఘాల సభ్యులు సాధించిన పురోగతిపై సమీక్షించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న రైతుల వంద రోజుల పనులు, ఈ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీ పెంపకాలు, గ్రామీణ రోడ్లు, చెరువుల పూడికతీత, వాటర్‌షెడ్ నిర్మాణ పనులపై ఉపాధి ఏపీవో పులిందర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, ఆసరా పింఛన్లు, వాటర్‌షెడ్డు పనుల, ఉద్యానవన నిర్మాణాలు, పాలశీతలీకరణ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. అచ్చాయిపల్లి పాఠశాలలో విద్యాప్రమాణాలు, మౌలిక వసతులపై పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీవో అనురాధ, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మణ్ గౌడ్, ఏపీడీ శ్రీపాధ్, ఏపీఎం వెంకటాచారి, ప్లాంటేషన్ మేనేజర్ సుస్మిత, ఏపీవో పులిందర్, పంచాయతీ కార్యదర్శులు సంతోషి, మహేందర్, ఉపాధి టీఏలు సుజిత, ఈశ్వర్, శ్రీనివాసులు మాజీ సర్పంచి సాయిరెడ్డి మండల నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు ఉన్నారు.

గాంధీజీని ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలి

● పాదయాత్రలో రిటైర్డ్ డీఈవో విజయకుమార్

హన్వాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గాంధీ బాటలో ప్రతీ ఒక్కరం నడుద్దామని రిటైర్డ్ డీఈవో విజయకుమార్ అన్నారు. బాపు బాటలో సత్యశోధన పాదయాత్ర బుధవారం హన్వాడ మండలంలో కొనసాగింది. గండీడ్ మండలం నుంచి హన్వాడ మండలంలోని నాయినోనిపల్లి, సల్లోనిపల్లి, హన్వాడలో పాదయాత్ర నిర్వహించారు. హన్వాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాంధీ యొక్క సిద్ధాంతాలు, నైతిక విలువలను ప్రచారం చేస్తూ 100 రోజులు 1000 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నారు. విద్యార్థులు గాంధీజీ ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాశోదమ్మ, మాజీ ఎంపీపీ బాలరాజు, ఏపీయం సుదర్శన్, ఉపాధ్యాయులు పద్మావతి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్, అన్నపూర్ణ, రాఘవేందర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేపై కాంగ్రెస్ సంబురాలు

● సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ నేతలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

మహబూబ్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కులగణన నిర్ణయం దేశంలోనే చారిత్రాత్మకమైనదని, రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రజలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కులగణన ప్రారంభం కావడంతో బుధవారం కాంగ్రెస్ ఓబీసీసెల్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్‌నేతలు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య మాట్లాడుతూ భారత్‌జోడో యాత్రలో రాహుల్‌గాంధీ ప్రజల కష్టాలు, బలహీనవర్గాల బాధలు కళ్లారా చూశారని, అందుకే కులగణన చేయాలని అప్పుడే నిర్ణయించారన్నారు.

ఆయన ఆశయం మేరకే ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మీడియాసెల్ ఇంచార్జి సీజె బెనహర్, నాయకులు బండి మల్లేష్, అశోక్‌యాదవ్, టీవీగౌడ్, గిరిగౌడ్, కృష్ణయ్య, గోవర్ధన్‌శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎల్‌వోసీ అందజేత

- సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మూసాపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన బుర్రముక్కు మన్నెమ్మ కొంతకాలం నుంచి నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఇందుకుగాను వైద్యఖర్చులు రూ.రెండు లక్షల యాభై వేలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ మాజీ సర్పంచి, కాంగ్రెస్ నాయకుడు యాదయ్య స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి చికిత్సకై రూ.2.50 లక్షల ఎల్‌వోసీని అందజేసినట్లు నాయకులు యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.